
# వ్యక్తిత్వం

డాక్టర్ ప్రసాద్ కల్లూరి



''సాంబయ్యా! నువ్వు అటేపు చూడు. ఈ కంపార్ట్ మెంట్‌లో నేను చూస్తాను'' హడావిడిగా కంపార్ట్‌మెంట్ దగ్గరికి పరిగెత్తుకెళ్లింది స్వప్న.

''కంగారు పడకమ్మా. చిన బాబుగారు నాకు గుర్తేకదా'' ధైర్యం చెప్పాడు సాంబయ్య.

ఆ పల్లెటూర్లో ఆగే ఒకే ఒక ఎక్స్ ప్రెస్ అది. అందులోంచి దిగిన ఆరు గురిలో ఫ్యాన్సీ డ్రస్‌లాంటి దుస్తుల్లో వున్న వినీత్‌ని చూసి విస్తుపోయింది స్వప్న.

''ఏంట్రా అన్నయ్యా.. ఈ బుడబుక్కల వేషం ఏమిటి? జులపాల జుట్టు, మధ్య పాపటి, మీసం లేకుండా ఒంటిచెవు పోగు పైగా గతిలేని ముష్టాడి లాగా మోకాళ్ళ దగ్గర చిరిగిన జీన్సు ప్యాంటు. పైగా వెలిసిపోయిన ఈ చేతుల్లేని చొక్కా? మన వూర్లో ఇలా తిరిగావంటే వీధికుక్కలు వెంటపడతాయి'' వివరించింది.

''లుక్ స్వప్నా! నేను వచ్చింది అమెరికానుంచి, అంగల కుదురునుంచి కాదు. ఇది లేటెస్ట్ ట్రెండ్. నువ్వేమో బైతులా ఈ పల్లెలోనే పెరిగావు. నాన్న పుణ్యమా అని, ఎంతగా అమ్మ అడ్డుపెట్టినా ఫారిన్ వెళ్ళగలిగాను. అది సరేలే, అమ్మా నాన్న ఎలా వున్నారు? కనీసం టాక్సీ తెప్పించి పంపొచ్చుగా?'' చిరాగ్గా అడిగాడు వినీత్.

''అరే అన్నయ్యా! నీకంత సీన్ లేదు గాని, ఈ డీలక్స్ రెండెడ్ల బండితో సర్దుకుపో. అంత బావుంటే, ఈ మారు నువ్వు వచ్చేసరికి కనీసం సెకండ్‌హాండ్ అంబాసిడర్ కారైనా తెప్పిస్తాను'' అంది స్వప్న టీజింగ్‌గా.

“స్వప్నమ్మ! అన్నయ్యగారిని ఏడిపించడం ఇక చాలు. నడిజాములోపు జాగ్రత్తగా ఇంటికిచేరు స్తాగా” అన్నాడు సాంబయ్య.

“రేయ్ వినీత్! నాకో సాయం చెయ్యాలిరా” అన్నారు సాంబమూర్తిగారు, తాంబూలం వేసు కుంటూ.

“డాడీ.. ఏంటది” స్టైల్‌గా అడిగాడు.

“ ఏమీ లేదురా, నువ్వు తల దువ్వుకునేట ప్పుడు చిన్న పిచ్చుక పిల్ల ఏమైనా దొరికితే, మర్చి పోకుండా ఇవ్వరా” క్యాజువల్‌గా అడిగారు మూర్తి గారు.

“డాడ్, మీరు నన్ను ఇలా అనుమానించడం ఏం బాలేదు” కసిగా అన్నాడు వినీత్.

“నీ తెలుగు తగలెయ్య. అది అనుమానించడం కాదు, అవమానించడం” కరెక్ట్ చేశారు మూర్తి.

“అన్నయ్యా! అమెరికాలో చప్పిడి తిండి తిని నోరు చవి చెడిపోయి వుంటుంది. కాసంత ఈ ఆవ కాయ కలుపుకోరా” అంటూ కొత్తగా పెట్టిన ఆవ కాయ వేసింది స్వప్న.

అంతదాకా పిజ్జాలూ, బర్గర్లూ తినడానికి అల వాటుపడ్డ వినీత్‌కు మన వంటలన్నా, రుచులన్నా కాస్త చిన్నచూపు. ఇదంతా ‘ఎర్రబస్సు’ టేస్టని అతని భావన.

అదే కేర్‌లెస్‌తో ఏమాత్రం చూసుకోకుండా కూర కలుపుకున్నంతలా, ఎర్రగా కలుపుకున్నాడు. మొదటి ముద్దను తన నోట్లో పెట్టుకోవడం ఆలస్యం వినీత్ పెట్టిన కేకకు వీధిలో ఎడ్లను కడుగు తున్న సాంబయ్య పరిగెత్తుకుంటూ వచ్చాడు కంగా రుగా.

కంట్లో నీళ్లు, ముక్కుల్లో ఆవిర్లు వస్తుండగా ఎంగిలిచేత్తోనే బాటిల్ ఎత్తుకుని గడగడా తాగే శాడు. మామూలు స్థాయికి రావడానికి గంట పట్టింది.

సాయంత్రం అయిదు గంటల సమయం.

స్వప్న వద్దంటున్నా వినకుండా ఫేడెడ్ బెర్ముడా, స్లీవ్‌లెస్ టీషర్ట్ వేసుకుని, క్యాప్ పెట్టుకుని ఊళ్ళోకి వెళ్ళాడు వినీత్. సమయానికి సాంబయ్య కూడా ఇంట్లో లేడు, తోడు వెళ్ళడానికి. మూర్తి పని మీద పక్కూరికి వెళ్ళివున్నారు. గంట గడిచింది. అంత చిన్న పల్లెటూర్లో తన అన్నయ్య ఎక్కడికి వెళ్ళి వుంటాడా అంటూ ఆలోచించసాగింది స్వప్న. అంతలో జరిగింది అనుకోని సంఘటన.

ఒళ్లంతా బురదకొట్టుకుపోయి, తలంతా గడ్డిప రకలతో రక్తం కారుతున్న కుడిపిక్కతో రొప్పు కుంటూ పరిగెత్తుకొచ్చాడు వినీత్. కనీసం నిలబడ లేకుండా వున్నాడు.

కంగారు పడింది స్వప్న.

ముందుగా బావి దగ్గరకు తీసుకుపోయి రెండు బక్కెట్ల నీళ్లు కుమ్మరించేసరికి బురద వదిలింది. కుంకుడు పులుసుతో చక్కగా స్నానం చేయించింది

ఇంట్లో అడుగు పెట్టేసరికి డెట్టాల్, టించర్, కాటన్, క్లాత్ రెడీ చేసింది వినీత్ తల్లి హేమ. జాగ్ర త్తగా డ్రెసింగ్ చేస్తూ అడిగింది స్వప్న “అసలదెలా జరిగింది” అని పిక్కవైపు చూపిస్తూ.

కొంత ఎంబరాసింగ్‌గా ఫీలయ్యాడు వినీత్. అయినా చెప్పక తప్పని పరిస్థితి.

“స్వప్నా, నా లాంటి మోడ్రన్ గై ఇలాంటి ప్రిమిటివ్ అట్మాస్ఫియర్‌లో వుండటం నా బ్యాడ్ లక్. సరదాగా వూరు చూసి వద్దామని బయలు దేరానా, పిల్లలంతా ఏదో వింత జంతువుని చూసి నట్లు నా చుట్టూ చేరి గోలచేశారు. అఫ్‌కోర్స్, నేను దానినేమీ పట్టించుకోలేదు. అలా రచ్చబండ వైపు వెళ్తుంటే, ఎక్కడి నుంచి వచ్చిందో ఓ నల్ల ఊర కుక్క నా వెంటపడింది. దాని నుంచి తప్పించుకో వడానికి నేను ప్రయత్నించే లోపలే నా పిక్కను పీకి పెట్టింది డర్టీ కంట్రీడాగ్.

అంతటితో అయిపోలేదు. అలా కుంటుకుంటూ వస్తున్నానా, ఓ ఆంబోతు రంకెవేసుకుంటూ వెంట పడింది. దాని నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పక్కకు దూకబోయాడు. అలా నేను దూకింది వూరి మురికి నీరు చేరే బురద గుంటలోకని తర్వాతే తెలిసింది. కట్ చేస్తే, ఇక్కడున్నాను” బాధగా ముగించాడు వినీత్.

తన్నుకొచ్చే నవ్వును ఆపుకోవడానికి తంటాలు పడింది స్వప్న.

అప్పుడు బయటినుంచి వచ్చిన మూర్తిగారు కొడుకు కాలికి కట్టువుండటం చూసి కంగారుప డ్డారు.

వివరాలన్నీ విడమరచి చెప్పింది స్వప్న.

“అందుకేరా వినీత్ నేను చెప్పింది. బూచాడిలా తయారై బయటికెళ్ళడానికి ఇది అమెరికా కాదు. రీతి, రివాజు ఇక్కడ వేరుగా వుంటాయి. ఇప్పటి కైనా నా మాట విని రేపు మన అప్పలకొండతో శుభ్రంగా జుట్టు కత్తిరించుకో. అలా కాదని తిరిగావ నుకో రేపు ఎవడి పిల్లవాడికైనా జడుపు జ్వరం వస్తే, ఖర్చులు నువ్వే భరించాల్సి వుంటుంది” అన్నారు మూర్తి.

“డాడ్! మళ్ళీ మీరు నన్ను అవమానిస్తున్నారు. అమెరికాలో వుండే నేను ఆ అంట్ల వెధవ అప్పల కొండతో హేర్‌కట్ చేయించుకోవాలా? నెవ్వర్. నన్ను ‘అహనాపెళ్ళంట’ సినిమాలో అరగుండు బ్రహ్మానందంలా తయారు చేస్తాడు. మీరే చూడండి, నేను ఇక్కడున్న మూడు నెలల్లో రాడిక ల్‌గా మార్చేస్తా ఈ బార్బేరియస్ విలేజ్‌ని” శపథం చేశాడు వినీత్.

“ ఈ మంగమ్మ శపథాలు తర్వాత.. ముందు బైటికెళ్ళకుండా ఇంట్లోనే వుండు” అన్నారు మూర్తి.

“డాడ్! నేను వద్దంటున్నా ఈ బలవంతపు పెళ్లి చూపులకు నన్ను తీసుకొచ్చారు. ముందే చెబు తున్నా, అమ్మాయి ఏ మాత్రం నచ్చకపోయినా వాళ్ళ మొహం మీద చెప్పేస్తే ఒక పనై పోతుందని నా అభిప్రాయం” తనో నిర్ణయానికి వచ్చినట్టు అన్నాడు వినీత్ కారు దిగుతూ.

“నోరు ముయ్యరా కుంకా. సూర్యనారాయణ మావయ్య మనకు బాగా కావల్సిన వాడు. పైగా అమ్మాయి పద్మ యంబిఏ చేసింది. వెధవ వేషాలె య్యక ఆనవాయితీ ప్రకారం చూడు. నీ పని అంత వరకే. మిగతా వ్యవహారం అంతా నేనూ, మీ

“అందుకేరా వినీత్ నేను చెప్పింది. బూచాడిలా తయారై బయటికెళ్ళడానికి ఇది అమెరికా కాదు. రీతి, రివాజు ఇక్కడ వేరుగా వుంటాయి. ఇప్పటికైనా నా మాట విని రేపు మన అప్పలకొండతో శుభ్రంగా జుట్టు కత్తిరించుకో. అలా కాదని తిరిగావనుకో రేపు ఎవడి పిల్లవాడికైనా జడుపు జ్వరం వస్తే, ఖర్చులు నువ్వే భరించాల్సి వుంటుంది” అన్నారు మూర్తి.

అమ్మా మాట్లాడుకుంటాం” హెచ్చరించారు మూర్తి.

“అబ్బాయ్! అంతలా జులపాలు పెంచావ్, తిరుపతి మొక్కా” అడిగాడో పెళ్ళి పెద్ద”

“హే యూ ఓల్డ్‌మాన్, స్టాపిట్. ఈ మొక్కులు, ముడుపులు అంతా ట్రాష్. ఇది అమెరికాలో లేటెస్ట్ ఫ్యాషన్” రెక్‌లెస్‌గా బదులిచ్చాడు వినీత్.

అతనలా చెప్పడం మూర్తికి నచ్చలేదు. బల వంతం మీద కోపాన్ని అణుచుకున్నాడు. అమ్మా యిని తెచ్చి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చోబె ట్టారు.

చక్కగా పట్టుచీర కట్టుకుని, జడకుచ్చులు, పాపటి బిళ్ళతో లక్ష్మీదేవిలా వున్న పద్మను చూసి అబ్బురపడ్డారు మూర్తిగారు.

రొటీన్‌గా వేసే ప్రశ్నలు వేసింది వినీత్ తల్లి. ఏదైనా అడగదలచుకుంటే అమ్మాయిని అడగొచ్చని అన్నారు సూర్యనారాయణ వినీత్‌తో.

“ఇంత ట్రెడిషనల్‌గా వున్న మీరు, అమెరికన్ కల్చర్‌కు అడ్జస్టవగలరా?” అడిగాడు కాస్త గర్వంగా.

“యూసీ, ఐయాం ఆల్సో ఏ పోస్ట్‌గ్రాడ్యు యేట్, దట్ టూ విత్ యంబిఏ డిగ్రీ. బట్, ఐ రెస్పెక్ట్ అవర్ కల్చర్. జడకుచ్చులు పెట్టుకున్నంత మాత్రాన ప్రిమిటివ్‌గా వూహించవచ్చు. నేను సంప్రదాయాన్ని గౌరవిస్తాను” కాన్ఫిడెంట్‌గా చెప్పింది పద్మ.

మూర్తిగారికి ముచ్చటేసింది.

“వన్ లాస్ట్ క్వశ్చన్. వుడ్ యు ప్రిఫర్ డేటింగ్ విత్ మీ బిఫోర్ మ్యారేజ్” క్యాజువల్‌గా అడిగాడు.

పద్మ ఆత్మాభిమానం దెబ్బతిన్నది.

“మిస్టర్ వినీత్, బిహేవ్ యువర్ సెల్ఫ్. మీరు

ఎంత అమెరికాలో వున్నా పుట్టి పెరిగింది మన దేశంలోనే కదా. అలాంటిది ఇక్కడి అలవాట్లు ఆచారాలు మీకు తెలియదా? డేటింగ్ లాంటి అడ్డమైన కల్చర్ అక్కడున్న మీరు ప్రిఫర్ చేయొచ్చు. ఎంత చదువుకున్నా, నేను మన సంప్రదాయాలకు కట్టుబడిన మనిషిని.

అంతవరకు ఎందుకు, డైరెక్ట్‌గా ఒక్కమాట అడుగుతున్నాను. మీరుకూడా సూటిగా సమాధానం చెప్పండి.

మీ చెల్లెలు స్వప్నను పెళ్లిసంబంధంలో చూడటానికి వచ్చిన ఎవరైనా పెళ్ళికొడుకు తనతో ఓ వారం గడిపి, నచ్చితే పెళ్ళాడతానంటే ఏం సమాధానం చెబుతారు. చూడండి, మోడ్రన్‌గా వుండటమంటే దిక్కుమాలిన హేర్‌స్టయిల్, ఒంటి చెవు పోగు, అడ్డమైన డ్రెస్ వేసుకుని తిరగడం కాదు. ఎంతోమంది విదేశాలలో వున్న మనవాళ్లు చక్కగా మన సంప్రదాయాలను, వేష భాషలను గౌరవిస్తూ హాయిగా జీవిస్తున్నారు. మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని గౌరవించి, జాన్ హిగ్గిన్స్ గారి లాంటి వారు త్యాగరాయ కీర్తనలను పది సంవత్సరాలపైన అభ్యసించి కచేరీలు చేస్తున్నారు. మైసూరు స్వామీజీ ఆశ్రమానికి వచ్చిన ఇద్దరు జర్మన్ యువతులు స్వతహాగా కోటీశ్వరులైనప్పటికీ అంతా వదులుకుని గాయత్రి, సరస్వతి అన్న పేర్లు పెట్టుకుని భక్తులకు సేవ చేస్తూ స్థిరపడ్డారు.

ఏం మీరు వాళ్లకన్నా గొప్పవారా? ఎవరిని మభ్యపెట్టడానికి మీ సూడో స్టేటస్. మీరు నన్ను వివాహం చేసుకోవచ్చు లేదా మా సంబంధాన్ని డ్రాప్ చేసుకోవచ్చు. కాని, మా అదృష్టం కొద్దీ చక్కని సంస్కారవంతమైన కుటుంబంలో పుట్టి, అలాగే పెరిగిన నాకు తల్లిదండ్రులు ఇచ్చిన వరం మన సంప్రదాయం.

అంతగా అవసరం వస్తే చక్కగా జాబ్ చేసుకుంటూ పెద్ద వయసులో మా తల్లిదండ్రులకు కొడుకులాగా తోడుంటానుగాని, దిగజారను.

'స్వధర్మో నిధనం శ్రేయః
పరధర్మో భయావహః'

అన్న గీతాచార్యుని బోధనుఅక్షరాలా నమ్మిన దాన్ని నేను. నా అభిప్రాయాన్ని కచ్చితంగా ఎక్స్‌ప్రెస్ చేసినందుకు నన్ను మన్నించండి'' అంటూ గబుక్కున లేచి విసవిసా లోపలికి వెళ్ళింది పద్మ.

అంత అనర్గళంగా, లాజికల్‌గా తన కూతురు మాట్లాడటం చూసిన సూర్యనారాయణ అవాక్కయ్యారు. తమ కుటుంబంలో మొదటిగా ఎంబిఎ చేసిన కూతురి అకడమిక్ ఇంట్రెస్ట్ గురించి అర్థం చేసుకోగలిగాడే తప్ప, అంత మెచ్యూర్డ్‌గా పద్మ ఎదుగుతోందని వూహించలేదు.

మరోవైపు తనకు అత్యంత ఆప్తుడైన మూర్తి ఫీలింగ్స్ ఎలా వుంటాయో అని భయపడ్డారు. అనవసరంగా ఇన్ని సంవత్సరాల తమ బంధుత్వంలో పొరపొచ్చాలు వస్తాయేమో'' అనిపించింది.

సూర్యనారాయణ ఆలోచనలకు భిన్నంగా రియాక్టయ్యారు మూర్తి.

''చూడు సూర్యం, ఇన్ని రోజులు నా అనుభవంతో మొదటి సారిగా సంస్కారంతో పాటు స్వాభిమానం గల ఆడపిల్లను చూశాను. నిజంగా నువ్వు అదృష్టవంతుడివి. మీ పద్మను నా కోడలుగా చేసుకోలేకపోతున్నందుకు బాధగా వున్నా, ఇంత కల్చరల్ బ్యారియర్ వున్న వీళ్ళిద్దరూ కలిసి జీవించడం కష్టం.

నాదొక కోరిక. మా స్వప్నను నీకు అభ్యంతరం లేకపోతే కొంతకాలంపాటు మీ ఇంటికి పంపుతాను. మీ పద్మ సహచర్యంలో తనక్కూడా అలాంటి సంస్కారం ఏమాత్రం అలవడినా నాకంటే సంతోషపడేవారు ఎవరూ వుండరు'' అంటున్నప్పుడు ఆయన గొంతులో ఆవేదన తొంగిచూసింది.

కార్లో తిరిగి వస్తున్నంతసేపూ ఎవ్వరూ మాట్లాడలేదు.

ఆరోజు రాత్రి భోజనం చేసి ఆరుబయట విశ్రాంతి తీసుకుంటున్న తండ్రి సూర్యనారాయణ దగ్గరికి వచ్చింది పద్మ.

''నాన్నా! నేనేమైనా తప్పుగా ప్రవర్తించానా'' అంటున్నప్పుడు ఆమె గొంతు జీరబోయింది.

అది చూసి కదిలిపోయారు ఆయన.

''అమ్మా పద్మా! ఇంతకాలం నా కూతురు కేవలం పెద్ద డిగ్రీల కోసం పరుగులు పెడుతోందన్న అపోహ నా మనసులో ఎక్కడోకాసింత వుండేది. కాని ఈరోజున నీ మాటలు విన్నమీదట డిగ్రీలతో పాటు కొండంత సంస్కారం, అంతకు మించిన ఆత్మవిశ్వాసం నీలో చూశాను. అంతకంటే నేను ఆ భగవంతుడిని ఏమీ కోరను.

ఈ రోజు ఓ మాట చెబుతున్నాను విను.

నీ అంతకు నీవు మనసారా కోరుకున్న వ్యక్తిని గుర్తించే వరకు నీ పెండ్లి ప్రస్తావన నేను తీసుకురాను'' అన్నారు ఓ నిర్ణయానికి వచ్చినట్టు.

అదే సమయంలో తన గదిలో రిలాక్సయిన వినీత్ దగ్గరికి వచ్చింది స్వప్న.

''అన్నయ్యా ఇంతకాలం నువ్వు ఎంతో గొప్పగా అమెరికాలో బ్రతుకుతున్నావని, నాన్నగారికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెడతావని అనుకున్నాను. ఈరోజు డిజప్పాయింట్ అయ్యాను. కల్చర్డ్‌గా వుండటమంటే ఫారిన్ అలవాట్లని కాపీ చేయడం కాదు. అక్కడున్న మన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, మన అస్థిత్వాన్ని నిలుపుకోవడం. ఒక్క విషయం మాత్రం చెప్పగలను.. నీకు మన సూర్యనారాయణ మావయ్య కూతురి సంబంధం తప్పిపోవడం మాత్రం కచ్చితంగా బ్యాడ్‌లక్. ఈ సందర్భంలో నాదొక చిన్న సలహా. ఇప్పటికైనా వాస్తవంలో బ్రతకడం నేర్చుకో. నీకంటూ ఒక ఐడెంటిటీ, ఇమేజ్ వుండేలా చూసుకో. నీకన్నా చిన్నదాన్ని, ఇలా చెబుతున్నందుకు ఏమీ అనుకోకు'' అంటూ వెళ్లిపోయింది.

దూరంగా మైకులో వినీత్‌కి వినిపించింది.

''స్వధర్మో నిధనం శ్రేయః
పరధర్మో భయావహః''

★

